క్లుప్తంగా

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి


స్థానికులతో మాట్లాడుతున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లోని 26 వార్డులో బుధవారం ఆయన పర్యటించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను ఆయను వివరించారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కృష్ణ కాంట్రాక్టర్లను సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ ప్రవీణ్, బండల వెంకటేశ్, నరేశ్, చందు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలి

రంగారెడ్డినగర్: చిన్నారులకు ఆధార్ నమోదు చేయించుకోవాలని ఐసీడీఎస్ రంగారెడ్డినగర్ సెక్టార్ సూపర్‌వైజర్ తిరుమల తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల నేతృత్వంలో ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ కేంద్రాన్ని బుధవారం ఆదర్శనగర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ఆధార్ తప్పనిసరిగా మారిందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోడాలి విజయరాణికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

నిజాంపేట్: బాచుపల్లికి చెందిన వీఆర్‌ఎస్ విజ్ఞానజ్యోతి రెసిడెన్షియల్ స్కూల్ డైరెక్టర్ కోడాలి విజయరాణి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ ఫర్ హెల్త్, ఎడ్యుకేషన్ అండ్ ఎకనామిక్ గ్రోత్‌కు తీసుకున్న చర్యలకు గాను థాయిలాండ్‌లోని ఎస్‌వీఏఎం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకాగ్ అధ్యక్షుడి చేతుల మీదుగా విజయరాణి అవార్డును అందుకున్నారు.

రోడ్డు విస్తరణలో తొలగిన అడ్డంకులు

కుత్బుల్లాపూర్: రోడ్డు విస్తరణలో భాగంగా కొంపల్లి మున్సిపాలిటీలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు చేపట్టిన పనులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా మున్సిపల్ కమిషనర్ శ్రీహరి చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం కమిషనర్ శ్రీహరి, డీఈ చిరంజీవు సిబ్బందితో కలిసి కొలతలు తీశారు. గ్రామం మీదుగా వెళ్లే సర్వీస్ రోడ్డు విషయంలో కొన్ని అభ్యంతరాలు రాగా వాటిని పరిశీలించేందుకు అధికారుల బృందం పలువురి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం పనులు ప్రారంభించారు.

వినయ్‌కుమార్ శాస్త్రికి వైదిక పురోహిత రత్న బిరుదు

రంగారెడ్డినగర్: భాగ్యనగర్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బుధవారం బొగ్గులకుంటలో శంకర పురస్కార మహోత్సవం ఘనంగా జరిగింది. రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన వినయ్‌కుమార్‌శాస్త్రి పురోహితులుగా వైదిక మతాభివృద్ధికి చేస్తున్న కృషికి వైదిక పురోహిత రత్న బిరుదుతో సత్కరించారు.

ప్రజలకు అన్ని సందర్భాల్లో అందుబాటులో ఉంటా

దుండిగల్: ప్రజలకు సేవ చేసే భాగ్యం తనకు కలిగిందని, వారికి అన్ని సందర్భాల్లో అందుబాటులో ఉంటానని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు బుధవారం ఆయనను కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీని కలిసిన కార్పొరేటర్లు..

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్ దంపతులతో పాటు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, సూరారం మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, నేతలు సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు.

బఫర్‌జోన్‌లో మట్టి నింపడంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని తుమర్ చెరువు బఫర్ జోన్‌లో మట్టి నింపడంపై మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ ఆధ్వర్యంలో బుధవారం కౌన్సిలర్లతో కలిసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దుండిగల్, మేడ్చల్ మండలం సరిహద్దులో చెరువు ఉండడంతో గండి మైసమ్మ తహసీల్దార్ పద్మప్రియ, మేడ్చల్ తహసీల్దార్ సరితలను కలిసి వినతి పత్రం సమర్పించారు. గతంలో అధికారులు వచ్చినప్పటికీ ఐదు రోజుల్లో పోసిన మట్టిని తొలగిస్తామని చెప్పినా ఇంత వరకు మట్టి తీయడం లేదని తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత వ్యక్తిపై చట్టపైనమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్ధరాత్రి కుత్బుల్లాపూర్ ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. నగర శివారు ప్రాంతాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదు కావడం భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో రాకపోకలు తీవ్ర అంతరాయం కల్గింది. 60 శాతం కాలనీల్లో అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయం విద్యుత్ సిబ్బంది రంగంలోకి దిగి మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. ముఖ్యంగా మురికివాడల పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షం పడ్డ ప్రతిసారి కంటి మీద కొనుకు లేకుండా పోతుందని అక్కడి ప్రజలు వాపోతున్నారు. వర్షం వల్ల వివిధ ప్రాంతాల్లో జరిగిన నష్టాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. – కుత్బుల్లాపూర్


నీట మునిగిన దీపోచంపల్లిలోని చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ

ఒక్క వర్షానికే ఇలా..

ఏకధాటి వర్షం.. బిక్కుబిక్కుమన్న జనం


ప్రగతినగర్‌లో వర్షం ధాటికి కూలిన చెట్లు

నియోజకవర్గ వ్యాప్తంగా ఇలా ఇబ్బందులు పడ్డారు...

- బాచుపల్లి ఆదిత్య గార్డెన్‌లో ఎగువ నుండి వచ్చిన వర్షం నీరు కాలనీ మొత్తం నీట మునిగిపోయింది. అర్ధరాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల కాలనీవాసులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. పలుచోట్ల కార్లు నీటిలో మునిగిపోయాయి. ఉదయం నీటి ఉధృతి తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు.
- ప్రగతి నగర్‌లో చెట్లు విరిగిపోవడంతో విద్యుత్ తీగలు తెగడం వల్ల అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ శాంతకుమార్ సిబ్బందితో అప్రమత్తమై పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేసి లైన్లను పునరుద్ధరించారు.

వరద ఉధృతి తగ్గడంతో ఊపిరిపీల్చుకున్న ముంపువాసులు

- గాజులరామారం డివిజన్ పరిధిలోని ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లో యథావిధిగా వరద నీటితో నిండిపోయింది. గతంలో పడ్డ వర్షాలతో ఇబ్బందులు పడ్డ జనం రాత్రి కురిసిన వర్షంతో మరోమారు భయంతో వణికిపోయారు. అదేవిధంగా ప్రధాన చౌరస్తాలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఫుట్‌పాత్ డబ్బాలపై పడ్డాయి.
- దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ బస్తీలో కిల్లల్లోకి మురుగునూరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పోచంపల్లి లోని చంద్రశేఖర్ రెడ్డికాలనీలో నడవడానికి వీలు లేకుండా ఇళ్ల మధ్యలో వర్షం నీరు చేరింది.
- షాపూర్‌నగర్ ఉషోదయ టవర్ నుంచి అయోధ్యనగర్‌కు వెళ్లే రోడ్డులో భారీ వృక్షాలు రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి నెలకొనడంతో అటువైపుగా వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు.
- దూలపల్లి నుంచి జీడిమెట్ల పారిశ్రామిక వాడకు వెళ్లే రహదారులు సైతం చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో వివిధ కంపెనీలకు ముడి సరుకులు తీసుకువెళ్లే వాహనాలు గంటల తరబడి రోడ్డుపైనే నిలిచిపోయాయి. మధ్యాహ్నం వరకు సిబ్బంది రంగంలోకి దిగి చెట్ల కొమ్మలను తొలగించారు. ఎస్‌ఆర్ నాయక్‌నగర్‌లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది.
- జగద్గిరిగుట్ట డివిజన్ షిరిడీ హిల్స్‌లో విజయ్ అనే వ్యక్తి ఇంటి పక్కనే ఉన్న చెట్టు విరిగిపడి ఇంటి మీదనే పడిపోవడంతో రేకులు పగిలి ఇంట్లో సామగ్రి పాడైపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వారు ప్రాణాలతో పరుగులు తీశారు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై చెట్లు చెట్ల కొమ్మలు పడి పోయాయి.


దూలపల్లి నుంచి జీడిమెట్లకు పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డులో పదుల సంఖ్యలో నెలకొరిగిన చెట్లు


షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్ నుంచి అయోధ్యనగర్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు


ఎస్‌ఆర్ నాయక్ నగర్‌లో కూలినచెట్లు


డాక్టర్ బస్తీలో ఇళ్లల్లోకి చేరిన నీరు


గాజులరామారంలో డబ్బాపై కూలిన చెట్టు


గాజులరామారం - షాపూర్‌నగర్ రోడ్డులో అడ్డంగా పడిన చెట్ల కొమ్మలు


షిరిడీహిల్స్‌లో ధ్వంసమైన ఓ ఇంటి పైకప్పు


నీటి మునిగిన ఓక్షిత ఎన్‌క్లేవ్ కాలనీ

ఘాటైన వాసనతో ఉక్కిబిక్కిరి

- జీడిమెట్లలో వర్షం పడిన ప్రతిసారి ఇదే తంతు
- రసాయనాలను వదిలేస్తున్న పరిశ్రమలు

జీడిమెట్ల: జీడిమెట్లలోని పలు కాలనీల్లో మంగళవారం రాత్రి ఘాటైన రసాయనాల వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఓ వైపు కరెంట్ లేక దోమలు కుడుతుండగా మరోవైపు రసాయనాల వాసన ప్రజల కంటిమీద కునుకులేకుండా చేసింది. సందిట్లో సడేమియా అన్నట్లుగా వర్షం కురిసిన ప్రతిసారి జీడిమెట్లలోని రసాయన పరిశ్రమల నుంచి రసాయనాలతో పాటు ఘాటైన వాసనలను బయటకు వదులుతారు. దీంతో జీడిమెట్ల పారిశ్రామికవాడకు ఆనుకుని ఉన్న ఎస్‌ఆర్‌నాయక్‌నగర్, అపురూపాకాలనీ, అయోధ్యనగర్, మోడీబిల్డర్స్, జనప్రియ అపార్ట్‌మెంట్ వాసులు రసాయనాల వాసనలకు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇదే తంతు కొనసాగుతుండటంతో ఏమి చేయాలో అర్థంకాక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

గాలివానకు కూలిన పైకప్పు



జీడిమెట్ల: గాలివానకు ఇంటిపైకప్పు కూలడంతో ఓ గృహిణికి స్వల్పగాయాలయ్యాయి. సుభాష్‌నగర్ శ్రీరామ సొసైటీకి చెందిన రాజు, తులసి భార్యాభర్తలు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటిపై కప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. పైకప్పు పైన ఉంచిన సిమెంట్ ఇటుకలు పడటంతో రాజు భార్య తులసికి స్వల్పగాయాలతో బయటపడింది.

కాలనీ అధ్యక్ష ఎన్నికకు నామినేషన్ల దాఖలు

చింతల్: భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల కోలాహలం మొదలైంది. వచ్చే నెలలో 7వ తేదీన జరిగే ఎన్నికల నేపథ్యంలో బుధవారం నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. అధ్యక్ష స్థానానికి శ్రీనాథ్‌రావు, అల్లాబకాష్, ప్రధాన కార్యదర్శి పదవికి కామ్రేడ్ సత్యం, నరసింహ నామినేషన్లు వేశారు. కాగా అల్లాబకాష్ రెండోసారి అధ్యక్ష బరిలో నిలిచారు.

జీవో.14 ద్వారా వేతనాలు పెంచాలి

చింతల్: కుత్బుల్లాపూర్ జలమండలి పరిధిలోని వివిధ సెక్షన్ కార్యాలయాల వద్ద బుధవారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన సమయంలో జీవో 14 ద్వారా వేతనాలు పెంచాలని ప్లకార్డులు ప్రదర్శించారు. జీడిమెట్ల సెక్షన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన సందర్భంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మాట్లాడుతూ.. స్వయానా మంత్రి కేటీఆర్ జీవో 14 ఫైల్‌పై సంతకం చేసినా అమలుకావడం లేదన్నారు.

మోదీ నాయకత్వానికి జైకొడితే ప్రజల బతుకులు అధోగతే..


ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా జగద్గిరిగుట్టలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట: ఉన్నవారికి దోచిపెట్టి పేదవారిని దండుకోవడమే బీజేపీ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని సీపీఐ నాయకులు అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని బుధవారం జగద్గిరిగుట్టలో ప్రారంభించారు. మొదటిరోజు సీపీఐ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాస్‌నగర్ లాస్ట్‌బస్టాప్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో వారు మాట్లాడారు. ఎన్నో హామీలతో గద్దెనెక్కిన మోదీ ఇప్పుడు పేదలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోజురోజుకు నిత్యావసరాల ధరలు పెంచుతూ పేదలపై మోయలేని భారం వేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మోదీ నాయకత్వానికి జైకొడితే మన బతుకులు అధోగతేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శులు శ్రీనివాస్ , పర్వీనా, సహాయక కార్యదర్శులు దుర్గయ్య, రాము మహిళా సమాఖ్య కార్యదర్శి హైమావతి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు భాస్కర్, సీపీఐ నాయకులు కృష్ణ, సదానంద్, రాములు, సాయిలు, శేఖర్, సహదేవ్, అరిఫ్, యూసూఫ్, రాజు, వెంకటేష్, శ్రీకాంత్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని దత్తత తీసుకున్న ఎన్‌సీసీ విద్యార్థులు



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు

దుండిగల్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. కళాశాల ఎన్‌సీసీ విభాగం మేడ్చల్ జిల్లాలోని శ్రీరంగవరం గ్రామాన్ని దత్తత తీసుకుంది. అందుతో భాగంగా ఆయా బృందం సభ్యులు వారం రోజుల పాటు ఆ గ్రామంలో సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం దుండిగల్‌లోని కళాశాల నుంచి బయలుదేరిన విద్యార్థులను మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ పంపిన నిరుద్యోగ, నిరక్షరాస్యత కలిగిన 15–29 సంవత్సరాల లోపు యువతి యువకుల సర్వే, పర్యావరణ పరిరక్షణ ర్యాలీ, స్వచ్ఛ భారత్, మహిళా సాధికారత, యువకులు, రైతులకు పలు అంశాలపై అవగాహన, విద్యార్థులకు పోషకాహారం, హరితాహారం తదితర విషయాలను వివరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రోగాం అధికారి నాయిని ఉదయ్‌రంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల దీక్షకు సంఘీభావం

కుత్బుల్లాపూర్: నిరుద్యోగులు, యువతకు న్యాయం చేసేందుకు వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో బుధవారం ఇందిరపార్కులోని ధర్నా చౌక్ వద్ద చేపట్టిన దీక్షకు విశేష స్పందన లభించింది. టీసేవ్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన ఈ దీక్షలో నిరుద్యోగులు, యువత, వివిధ సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఏనుగుల భాస్కర్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెపోగు విజయరాజు, జిల్లా జనరల్ సెక్రటరీ కొండా అప్పారావు, కీసర మండల అధ్యక్షుడు ఉద్దెమర్రి సోమన్న, ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు కోట్ల చక్రధర్‌రెడ్డి, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు రుపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి



నిజాంపేట్: పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకుండా ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని నిజాంపేట్ కార్పొరేషన మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని చెత్త సేకరణ విషయమై ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేయర్ నీలారెడ్డి, హెల్త్ ఆఫీసర్ అజీజ్ ఖాసింతో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రగతినగర్ చెత్త సేకరణ ఆటో సిబ్బందితో అధికారులు సమావేశయ్యారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, హోటళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని సూచించారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఇంద్రజిత్ రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, శ్రీరాములు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌మ్యాక్స్ కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోం

కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


కార్మికుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ ఉద్యోగులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. జీడిమెట్లలోని సూపర్‌మ్యాక్స్ బ్లేడ్ కంపెనీ ఉద్యోగులకు జీతాలు చెల్లించకుండా పరిశ్రమను మూసేసిన విషయం పాఠకులకు విదితమే. కాగా తమకు న్యాయం చేయాలని పరిశ్రమ కార్మికులు 55రోజులుగా పరిశ్రమ వద్ద రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు. బుధవారం శ్రీశైలంగౌడ్ కార్మికుల దీక్షకు తన వంతు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన రూ.60కోట్లను పరిశ్రమ వెంటనే విడుదల చేసి కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

ఎమ్మెల్యే, మంత్రి మొసలి కన్నీరు కార్మికుల పొట్ట నింపదు..

తూతూ మంత్రంగా కార్మికుల వద్దకు వచ్చిన మంత్రి మల్లారెడ్డి సూపర్‌మ్యాక్స్ కార్మికుల భద్రత కోసం ఒక్క అడుగు సైతం ముందుకు వేయలేదని శ్రీశైలంగౌడ్ అన్నారు. తీయటి మాటలు కార్మికుల పొట్ట నింపవని.. మంత్రికి చేతనైతే కార్మికుల తరపున పోరాడి యాజమాన్యం మెడలు వంచి జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు మొక్కుబడిగా వచ్చి వెళ్లడమే తప్పా కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులు, ఉద్యోగులు, కార్మికులు ఏ పూటకు ఆపూట అన్నట్లు బతకుతున్నారని తెలిపారు.

కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తా..

సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ యాజమాన్యం తీరు వలన కార్మికులు వారి కుటుంబాలు పడుతున్న బాధను కేంద్ర కార్మికమంత్రి భూపేందర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని ఆయన అన్నారు.

అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేయం



కుత్బుల్లాపూర్: అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని.. ఎన్ని నిధులైనా మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా బుధవారం సుభాష్‌నగర్ పరిధిలోని జ్యోతినగర్, ముత్తయ్యనగర సుందర్‌నగర్‌లోఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రూ.20 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరుపై స్థానికులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలోని మిగిలి ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మన్నె రాజు, పెద్ద వెంకటస్వామి, చిన్న వెంకటస్వామి, తారా సింగ్, ప్రభాకర్, రాజ్ కుమార్, కావలి రవి, బాల్ రెడ్డి, పోచయ్య ముదిరాజ్, చారి, మురళి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజ.. ఉంటుంది రుచిగా!

వేసవిలో తాటి ముంజలను ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు. ఎన్నో పోషకాలతో పాటు వేసవి తాపాన్ని తీర్చే గుణం తాటి ముంజలకు ఉంది. నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి తాటి కాయలను విక్రయదారులు తీసుకొస్తున్నారు. దజన్ ముంజలను రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాల్లో తాటి ముంజలను బుధవారం విక్రయిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – నిజాంపేట్









కుత్బుల్లాపూర్‌లోని షాపూర్ నగర్, సుచిత్ర, గాజులరామారం, బాచుపల్లి ప్రధాన రోడ్ల పక్కన తాటి ముంజలను విక్రయిస్తున్నారు. వీటిని నగర శివారు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నామని చిరువ్యాపారులు పేర్కొంటున్నారు. – సుభాష్‌నగర్